సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 28 । నవంబర్ । 2023



కిలో టమాట రూ.22
అనంతపురం శివారు కక్కలపల్లి టమాట మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.16 ప్రకారం ధర పలికింది.



కార్తీక శోభ
కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలన్నీ దీపాల వెలుగులో కనువిందు చేశాయి. జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. 8లో

గరిష్టం/కనిష్టం
33.2°/ 19.4°
సోమవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

శ్రీనివాస్ నాయక్ కుటుంబానికి అండగా ఉంటాం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్



శ్రీనివాస్ నాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వడిత్యా శంకరనాయక్, అశ్వర్థనాయక్

పెనుకొండ రూరల్: చెన్నైలోని ఓ లాడ్జీలో ఆత్మహత్య చేసుకున్న బుక్కపట్నం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ నాయక్ (44) కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. ఈ నెల 22న ఏసీబీ అధికారులు దాడి చేసి శ్రీనివాస్ నాయక్‌ను పట్టుకోగా, అతను వారి నుంచి తప్పించుకుని వెళ్లిన విషయం తెలిసిందే. అయితే నేరుగా చెన్నై చేరుకున్న శ్రీనివాస్ నాయక్ ఈ నెల 25వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి అతని మృతదేహం స్వగ్రామం పెనుకొండ మండలంలోని గోనిపేటకు తీసుకువచ్చారు. మృతుకి భార్య సుజాత, కుమారుడు పవన్ కుమార్, కూతురు హిమబిందు ఉన్నారు. సోమవారం ఉదయం ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్, టీటీడీ బోర్డ్ సభ్యుడు అశ్వర్థనాయక్ గోనిపేటకు వెళ్లి శ్రీనివాస్ నాయక్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ...శ్రీనివాస్ నాయక్ మృతిపై ఎన్నో అనుమానాలున్నాయని, పూర్తి స్థాయిలో విచారణ జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేలా చూస్తామన్నారు. గిరిజన సంఘం నాయకులు చక్రినాయక్, అంజినాయక్, తిరుపాల్, గంగాధర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు



ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణికి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయుడు రంగారెడ్డి

చిలమత్తూరు: రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకూడదన్న నిబంధనలు ఉల్లంఘించి ఓ ఉపాధ్యాయుడు టీడీపీ కార్యక్రమంలో హల్‌చల్ చేశాడు. సోమవారం మండలంలోని కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజనాల కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు రంగారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో అన్నీ తానై వ్యవహరించారు. ఈయన గతంలో టీడీపీ చిలమత్తూరు మండల కన్వీనర్‌గా పనిచేశారు. అయితే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 1998 డీఎస్సీ విషయంలో తీసుకున్న నిర్ణయంతో రంగారెడ్డికి ఇటీవలే టీచర్ పోస్టు వచ్చింది. మండలంలోని వడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. అయినప్పటికీ టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ విషయంలో అధికారులు కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ టీచర్ అయి ఉండి టీడీపీ కార్యకర్తలా పనిచేయడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు.

బడుగులకు గౌరవం

- సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం
- ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట
- సామాజిక సాధికారతను వివరించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు
- మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపు
- తాడిపత్రిలో బస్సు యాత్ర విజయవంతం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ప్రజాప్రతినిధులు



సభలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రి ఉషశ్రీ, ఎంపీలు రంగయ్య, నందిగం సురేష్, ప్రభుత్వ విప్ కాపు, ఎమ్మెల్యేలు పెద్దారెడ్డి, శంకరనారాయణ, హఫీజ్ ఖాన్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నాయకులు

తాడిపత్రి: బడుగు,బలహీన వర్గాల వారికి తగిన గౌరవం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం లభించిందని పేర్కొన్నారు. సోమవారం తాడిపత్రి పట్టణంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, ఉషశ్రీ చరణ్‌తో పాటు ఎంపీలు తలారి రంగయ్య, నందిగం సురేష్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ, వైఎస్సార్ సీపీ ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, పార్టీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న తదితరులు పాల్గొన్నారు. మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద పీట వేసిన ఖ్యాతి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మంచి స్కిల్స్ ఉన్న సీఎంగా జగనన్న పేరు గడిస్తే, సీఎం పీఠాన్ని దుర్వినియోగం చేసి స్కాంలు చేసిన వ్యక్తిగా టీడీపీ అధినేత చంద్రబాబు చరిత్రకెక్కారన్నారు. ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అన్న వ్యక్తి నేడు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలనను పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

పోటెత్తిన జనం

తాడిపత్రిలో సామాజిక సాధికార బస్సు యాత్రకు జనం పోటెత్తారు. స్థానిక సీబీ రోడ్డు జనసంద్రాన్ని తలపించింది. మధ్యాహ్నం 3.30 గంటలకు భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ప్రజాప్రతినిధులు బయలుదేరారు. సిద్ధిబాష దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ర్యాలీ వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకుంది. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, సభాస్థలి వద్దకు చేరుకున్నారు. ర్యాలీ ఆద్యంతం జై జగన్.. నినాదాలు మార్మోగాయి. సభ ప్రారంభానికి ముందు సీఎం జగన్ పాలనపై వినిపించిన పాట అందరినీ ఉర్రూతలూగించింది.



తాడిపత్రిలో సామాజిక సాధికార బస్సు యాత్రకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు



చంద్రబాబు ఏనాడూ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన పాపానపోలేదు. జేసీ ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ ఎన్నికల ముందు సేవ్ తాడిపత్రి అని మొసలి కన్నీరు కార్చారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి పదవులు ఇస్తానని చెప్పి గెలిచారు. విజయం సాధించాక నమ్మిన వారిని వంచించారు. తినే తిండి నుంచి కట్టేబట్ట వరకు ప్రజల నుంచే దోచుకుంటున్నారు. తాడిపత్రిలో 20 షాపురూములను బినామీలకు కట్టబెట్టి బాడుగల ద్వారా బతికేస్తున్నారు. తాడిపత్రిలో ఏ అభివృద్ధి పని చేపట్టినా అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారు. జూనియర్ కళాశాల గ్రౌండ్ ప్రహరీ నిర్మాణ పనులతో పాటు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పనులను అడ్డుకున్నారు. బీసీలు, మైనార్టీలకు ఆంజనేయస్వామి మాన్యంలో 750 పట్టాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తే అడ్డు తగిలారు. తాడిపత్రిలో ఆస్పత్రి నిర్మాణ పనులు చేయిస్తుంటే, కాంట్రాక్టర్, ఇతర కార్మికులను బెదిరిస్తున్నారు. ఇలాంటి లుచ్చాలు ప్రజాప్రతినిధులైతే తాడిపత్రి ఎలా సాధ్యం.

– కేతిరెడ్డి పెద్దారెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే

నేడు జ్యోతిరావుపూలే వర్ధంతి

పుట్టపర్తి అర్బన్: బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తామన్నారు. జిల్లా అధికారులంతా కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులకు 4న ఇంటర్వ్యూలు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తున్న అభ్యర్థులకు డిసెంబర్ 4వ తేదీ ఉదయం 9 గంటలకు కర్నూలులోని ఆర్టీసీ శిక్షణ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడుల్లో ఐటీఐ పూర్తి చేసిన 40 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జనన, కుల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌తో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకుని రావాలన్నారు. మరింత సమాచారం కోసం 08518- 257025 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ

ఓడీచెరువు: మండలంలోని తిప్పేపల్లి విద్యుత్ ఉపకేంద్రానికి మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి వర్చువల్‌గా భూమిపూజ చేయనున్నారు. స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొంటారని మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమం అనంతరం స్థానిక వైఎస్సార్ సర్కిల్ ఎదురుగా బహిరంగ సభ ఉంటుందని, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

స్పందన అర్జీలన్నింటికీ పరిష్కారం చూపాలి

- 'గడప గడపకూ' పనులు వేగవంతం చేయాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'స్పందన', జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అందే అర్జీలన్నింటినీ గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జేసీ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, సీపీఓ విజయ్‌కుమార్ తదితరులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 187 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... స్పందనలో అందే అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపకపోయినా, పెండింగ్‌లో ఉంచినా అర్జీదారుడు మళ్లీ స్పందన కార్యక్రమానికి వస్తారన్నారు. అందువల్ల అధికారులంతా అర్జీలను క్షుణ్ణంగా చదివి, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, ఇళ్ల నిర్మాణాలు, ఆడుదాం ఆంధ్రా, 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో మంజూరైన పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న 22 సచివాలయాలు, 10 ఆర్బీకేలు, 8 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో గుర్తించిన 1,382 పనులకు గాను 1,227 మంజూరయ్యాయన్నారు. ఇందులో 1,099 పనుల గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన 128 పనులు త్వరగా గ్రౌండింగ్ చేయాలన్నారు. జిల్లాలో 'ఆరోగ్యశ్రీయాప్'ను ఇంకా 2 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే ఈమేరకు చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు జిల్లాకు ఎన్నికల రోల్ అబ్జర్వర్..

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పరిశీలనకు మంగళవారం ఎన్నికల రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్ష ఉంటుందని, సంబంధిత అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి చాంద్‌బాషా, పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ సోని, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, డీపీఓ విజయ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో అందిన అర్జీల్లో కొన్ని...

- పుట్టపర్తి మండలం పెడపల్లి సర్వే నంబర్ 169–2లోని తన 3 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పెడపల్లికి చెందిన శాంతమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమార్కులు తన సంతకాన్ని ఫోర్జరీ చేసి భూమి కాజేయాలని చూస్తున్నారన్నారు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.
- తాను ధర్మవరం మండలం రామాపురం సర్వే నంబర్ 490–2లోని 11 ఎకరాల్లో మామిడితోట సాగు చేస్తున్నానని, ఇటీవల కొందరు చెట్లు నరికి వేశారని రామన్న కలెక్టర్ ఎదుట వాపోయారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవించే తనకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు.
- తాను ముదిగుబ్బ మండలం ముక్తాపురం పంచాయతీ నల్లచెర్లోపల్లి సర్వే నంబర్ 549లోని 3 ఎకరాల భూమిని 20 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నానని, ప్రస్తుతం సదరు భూమిపై ఇతరుల పేరు మీద పట్టా పొందుతున్నారని ఆదినారాయణ అనే వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూమిపై తనకు హక్కులు కల్పించి న్యాయం చేయాలని వేడుకున్నాడు.

15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: గ్రామీణ క్రీడాకారులను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు జిల్లాలో డిసెంబర్ 15 నుంచి ప్రారంభమవుతాయని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు సంబంధించిన లోగో, పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 3వ తేదీ వరకూ క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనడానికి నవంబర్ 27 నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. 15 ఏళ్లు నిండిన వారంతా అర్హులన్నారు. రిజిస్ట్రేషన్లను గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవచ్చన్నారు. లేదా https:// aadudamandra. ap. gov. in వెబ్‌సైట్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు.

విజేతలకు నగదు బహుమతులు..

'ఆడుదాం ఆంధ్రా' విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో గెలుపొందిన వారికి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు ఉంటుందన్నారు. అలాగే జిల్లా స్థాయిలో రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.20వేలు, రాష్ట్రస్థాయిలో రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల నగదు బహుమతులు ఉంటాయన్నారు.

- బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన వారికి నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, జిల్లా స్థాయిలో రూ. 35 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రాష్ట్రస్థాయిలో రూ.2 లక్షలు, రూ.లక్ష, రూ.50 వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సాధికార సంస్థ అధికారి ఉదయ్‌భాస్కర్, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'కృష్ణవేణి సంగీత నీరాజనం'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ చేతన్, అధికారులు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్వాన్ వినయ్ స్వర బృందం

లేపాక్షి: శాస్త్రీయ సంగీత గొప్పతనం, హరికథా నామసంకీర్తన, సంప్రదాయాలను జనంలోకి తీసుకువెళ్లడమే లక్ష్యంగా నిర్వహించిన 'కృష్ణవేణి సంగీత నీరాజనం' సంగీత కచేరీ ప్రజలను మంత్రముగ్ధులను చేసింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ సహకారంతో సోమవారం విద్వాన్ వినయ్ స్వర బృందం లేపాక్షి నంది విగ్రహం వద్ద నిర్వహించిన కర్ణాటక సంగీత కచేరీ ఎంతగానో ఆకట్టుకుంది. లేపాక్షి వైభవాన్ని, శిలకళా సౌందర్యాన్ని కీర్తిస్తూ సాగిన సంగీత కచేరీ ఆహూతులను అలరించింది. కార్యక్రమానికి ముందు జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. భారత దేశం సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమన్నారు. మన వారసత్వ సంపదను రక్షించుకోవడం, మన సంప్రదాయాలను ప్రపంచానికి చాటేందుకు కార్తీకమాసంలో తొలిసారి విజయవాడ కృష్ణానది ఒడ్డున డిసెంబరు 10 నుంచి 12వ తేదీ వరకు 'కృష్ణవేణి సంగీత నీరాజనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే నేడు లేపాక్షి నంది విగ్రహం వద్ద కచేరీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ అధికారి చంద్రా నాయక్, కర్నూలు ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్, పురావస్తు శాఖ అధికారి బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ బాబు, చరిత్రాకారుడు మైనాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం భేష్

జిల్లా రైతులను ప్రశంసించిన అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం



పెడపల్లిలో బొప్పాయిలో వేసిన అంతర పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం



చలివెందులలో జీవామృతంతో సాగు చేస్తున్న పంటలను పరిశీలిస్తున్న విదేశీ బృందం

పుట్టపర్తి అర్బన్/హిందూపురం అర్బన్: జిల్లా రైతులు చేపట్టిన ప్రకృతి వ్యవసాయ విధానాలు అద్భుతంగా ఉన్నాయని అంతర్జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రశంసించారు. లావోస్, కెన్యా, జింబాబ్వే, సెనెగల్, ట్యూనిషీయా, పెరూ వంటి దేశాలకు చెందిన 60 మంది శాస్త్రవేత్తలు, పరిశోధకుల బృందం సోమవారం జిల్లాలో పర్యటించింది. విశ్రాంత ఐఏఎస్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లాకు వచ్చిన బృందం సభ్యులు తొలుత హిందూపురం మండలం చలివెందుల, ఆతర్వాత పుట్టపర్తి మండలం పెడపల్లి, కొట్లపల్లి గ్రామాల్లో పర్యటించింది. చలివెందులలో పర్యటించిన బృందం సభ్యులు రైతులు గంగాధరప్ప, హర్షవర్ధన్, రాధమ్మ తదితరులు ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను పరిశీలించారు. అనంతరం ప్రకృతి సేద్యం పద్ధతులు, బీజామృతం, ద్రవ, ఘన జీవామృతం, విత్తన గులికల తయారీ విధానం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. వక్క పంటలో అంతర పంటగా కంది, ఆముదం, అలసంద, అనుములు, గోరు చిక్కుడు సజ్జ , ఆకు కూరలు సాగుచేసే పద్ధతి బాగుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్, డీపీఎం లక్ష్మీ నాయక్ రైతులను ప్రశంసించారు. అనతంరం పుట్టపర్తి మండలం పెడపల్లి, కొట్లపల్లి గ్రామాలను సందర్శించిన శాస్త్రవేత్తల బృందం ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగవుతున్న పంటలను పరిశీలించి, రైతులతో ముచ్చటించారు. పెడపల్లిలో గిరినాయక్ బొప్పాయి తోటను పరిశీలించారు. 10 రకాల అంతర పంటలను సాగు చేయడం చూసి ఆశ్చర్యపోయారు. అనంతరం కొట్లపల్లి గ్రామంలో పర్యటించి ద్రవ, ఘన, జీవామృతాలను తయారు చేసే విధానాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, రైతు సాధికార సంస్థ ఏడీ శ్యామ్యూల్ ఆనంద్, సీనియర్ సలహాదారు మురళీధర్, ప్రాంతీయ సమన్వయకర్త వెంకటరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న 'సెబ్' తనిఖీలు


సీజ్ చేసిన ట్రాక్టర్‌ను చూపిస్తున్న సెబ్ అధికారులు

పుట్టపర్తిటౌన్: జిల్లా వ్యాప్తంగా సెబ్ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. కొత్తచెరువు మండలం మరకుంటపల్లిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, 4 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అలాగే హిందూపురం, కదిరి సెబ్‌స్టేషన్ పరిధిలో 110 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. 120 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

పాతిపెట్టిన మృతదేహం వెలికితీత


మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

సోమందేపల్లి: స్థానిక స్నేహలత నగర్‌కు చెందిన అమరనాథరెడ్డి మృతదేహాన్ని సోమవారం పోలీసులు వెలికితీశారు. ఈ నెల 12న జరిగిన ఘర్షణలో గాయపడడంతోనే తన కుమారుడు మృతి చెందాడని మృతుడు అమరనాథరెడ్డి తల్లి సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు రీ పోస్టుమార్టంకు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్ సురేష్ సమక్షంలో వైద్యుడు రామ్‌నాయక్ పోస్టుమార్టం నిర్వహించారు. నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

జిల్లా ప్రగతి పరుగు

ఏ ఊరెళ్లినా తాగునీటికి కటకట.. ఎటు చూసినా అపరిశుభ్రత.. ఎటెళ్లినా కంకర తేలి, పాడైన రహదారులు, పుటుక్కుమని తెగిపడే కల్వర్టులు.. కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ భవనాలు.. ఇదీ గత టీడీపీ హయాంలోని జిల్లా దుస్థితి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె సీమల రూపురేఖలు మారిపోయాయి. జిల్లా పరిషత్‌కు పాలక వర్గం ఏర్పాటైన రెండేళ్లలోనే అభివృద్ధి పరుగులు తీసింది. ప్రతి పల్లె ప్రగతి పథంలో పయనిస్తోంది. అన్ని హంగులతో పల్లె సీమలు అలరారుతున్నాయి.


పామిడి మండలం వంకరాజుకాలువలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి ట్యాంక్


కమలాపురం-కృష్ణాపురం గ్రామాల మధ్య వేసిన తారు రోడ్డు

- జిల్లా పరిషత్ పరిధిలో రెండేళ్ల వ్యవధిలో అభివృద్ధి పనులకు రూ.28.54 కోట్లు
- రూ.7.62 కోట్ల సాధారణ నిధులతో వివిధ పనులు
- పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలకు రూ.8.40 కోట్లు
- రహదారులు, కల్వర్టులు, భవన మరమ్మతులకు రూ.12.52 కోట్లు

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. జెడ్పీ చైర్‌పర్సన్‌గా గిరిజమ్మ పగ్గాలు చేపట్టిన తర్వాత గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఫలితంగా గత 20 ఏళ్లల్లో జరగని అభివృద్ధి కేవలం రెండేళ్లలోనే సాధ్యమైంది. ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి ఆమె చూపుతున్న చొరవ ఫలితంగా మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయి.

ప్రమాణస్వీకారం రోజు నుంచే..

2021, సెప్టెంబర్ 25న జెడ్పీ చైర్‌పర్సన్‌గా గిరిజమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. అదే ఏడాది అక్టోబర్, 10 నుంచి అధికారిక బాధ్యతలు చేపట్టారు. వెనువెంటనే 63 మండలాల జెడ్పీటీసీ సభ్యులను సమన్వయం చేసుకుని మండలాల వారీగా సమస్యలను నివేదిక రూపంలో తెప్పించుకున్నారు. వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగారు.

రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు..

అక్షర క్రమంలోనే కాదు.. వైశాల్యంలోనూ పెద్ద జిల్లాగా గుర్తింపు పొందిన ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో ఒకప్పుడు సమస్యలూ అధికమే. వీటన్నింటినీ అధిగమించేలా జగన్ సర్కార్ జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు రూ.కోట్ల మేర నిధులు మంజూరు చేస్తూ వచ్చింది. ప్రజాధనంలో ప్రతి పైసాకు జెడ్పీ చైర్‌పర్సన్ జవాబుదారీగా ఉంటూ అభివృద్ధి పనులను పారదర్శకంగా పూర్తి చేయిస్తూ వచ్చారు. జనరల్ ఫండ్ సహా 15వ ఆర్థిక సంఘం కింద రూ.7.62 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు పూర్తి చేశారు. పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలకు రూ.8.40 కోట్లు వెచ్చించారు. మరో రూ.12.52 కోట్లతో రహదారులు లేని గ్రామాలకు రోడ్లు వేయించారు. కల్వర్టులు నిర్మించారు. పాడైన రహదారులు, కల్వర్టులకు మరమ్మతులూ చేయించారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ భవనాల మరమ్మతుకూ చర్యలు చేపట్టారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో..

జిల్లా సమగ్రాభివృద్ధిలో ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, ప్రభుత్వాధికారులు, ఉద్యోగులందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగడంతో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నివిధాలా సక్సెస్ అయ్యారు. పరస్పర సహకారంతో అభివృద్ధికి బాటలు వేశారు. మండలాల వారీగా జెడ్పీటీసీలను పిలిపించుకుంటూ ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ఆయా పనుల పూర్తికి అధికారులతో నివేదికలు తెప్పించుకుని నిధులు మంజూరు చేస్తూ వెళ్లారు.

మరింత అభివృద్ధికి ప్రణాళిక..

గిరిజమ్మ పదవీ కాలం మరో మూడేళ్లు ఉంది. ఈ మూడేళ్లలో ఏమేం అభివృద్ధి పనులు చేపట్టాలనే అంశాలను ఇప్పటికే ఆమె సిద్ధం చేసుకున్నారు. ఆయా పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు, వాటిని సమీకరించుకోవడంపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

'అనంత'దే అగ్రస్థానం



రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతోంది. అధికారులు, జెడ్పీటీసీ సభ్యుల సహకారం మరువలేను. ముఖ్యంగా జిల్లా సమస్యలను ప్రస్తావించి, అదనపు నిధులు అడిగినప్పుడల్లా సానుకూలంగా స్పందిస్తూ వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా. రాబోవు మూడేళ్లలో జిల్లాలో మరిన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం.
– గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

రెండు ఇళ్లలో చోరీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రియాంకనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... ఆటో డ్రైవర్ మహేష్‌రెడ్డి, సరస్వతి దంపతులు ఆదివారం ఇంటికి తాళం వేసి కడపలోని దేవాలయానికి వెళ్లారు. సోమవారం ఉదయం తలుపులు బద్దలుగొట్టిన విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే సమాచారాన్ని మహేష్‌రెడ్డికి చేరవేశారు. సోమవారం సాయంత్రానికి ఇంటికి చేరుకున్న మహేష్‌రెడ్డి.. ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి 10 తులాల బంగారు నగలు, రూ.13 వేలు అపహరించుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగూ సోమందేపల్లి తహసీల్దార్ మురళీకృష్ణ ఆదివారం ఇంటికి తాళం వేసి మరో ఊరికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారు గమనించి సమాచారం అందించారు. అయితే తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన ఇంట్లో ఎంత మేర సొత్తు అపహరణకు గురైంది తెలియరాలేదు. చోరీ జరిగిన రెండు ఇళ్లనూ సీఐ సుబ్రహ్మణ్యం, వన్‌టౌన్ పోలీసులు పరిశీలించారు. మహేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఓ కేసు నమోదు చేయగా, తహసీల్దార్ మురళీకృష్ణ వచ్చిన తర్వాత ఆయన ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.


మహేష్‌రెడ్డి ఇంటిని పరిశీలిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

కట్టుకున్నోడే రోడ్డు పాల్జేశాడు!

- వివాహేతర సంబంధం మోజులో భార్యాపిల్లలను పట్టించుకోని భర్త
- న్యాయం చేయాలని 'పోలీసు స్పందన'లో బాధితురాలి వేడుకోలు


తనకు న్యాయం చేయాలని కోరుతున్న వివాహిత రమణమ్మ

పుట్టపర్తి టౌన్: వివాహేతర సంబంధం మోజులో తమను రోడ్డు పాలు చేసిన భర్తపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలంటూ అదనపు ఎస్పీ విష్ణును పిల్లలతో కలసి ఓ వివాహిత వేడుకుంది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయనకు వినతి పత్రం అందజేసి, మాట్లాడింది. వివరాలు.. నల్లమాడ మండలం రెడ్డిపల్లికి చెందిన రమణమ్మకు అదే మండలం దొన్నికోటకు చెందిన అంజితో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. ప్రస్తుతం వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో పరాయి స్త్రీ తో అంజి వివాహేతర సంబంధం కొనసాగించడం గమనించిన రమణమ్మ నిలదీసింది. దీంతో భార్యను కొట్టి, ఇంట్లో నుంచి బయటకు గెంటేశాడు. దీంతో ఆమె రోడ్డుపాలైంది. చివరకు భిక్షమెత్తుకుంటూ పిల్లలను పోషించుకుంటోంది. తన దుస్థితిని ఏఎస్పీ విష్ణుకు ఆమె వివరించి, తనకు న్యాయం చేయాలని విన్నవించింది. కాగా, పోలీసు స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 26 వినతులు అందాయి. పరిశీలించిన ఏఎస్పీ విష్ణు... ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అల్లుడిపై మామ దాడి

కళ్యాణదుర్గం: ఇల్లరికం వచ్చేందుకు ఇష్టపడని అల్లుడిపై మామ దాడి చేశాడు. వివరాలు.. కళ్యాణదుర్గం మండలం కొత్తూరుకు చెందిన నరసింహులు కుమార్తె గోవిందమ్మ, కంబదూరు మండలం జక్కిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిద్దయ్య ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ప్రస్తుతం ఓ కుమార్తె ఉంది. కొన్ని రోజుల క్రితం గోవిందమ్మ పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో తన భార్యను పిలుచుకెళ్లేందుకు ఆదివారం సిద్దయ్య కొత్తూరుకు చేరుకున్నాడు. రాత్రి మామ నరసింహులుతో మాట్లాడుతూ తన భార్యను కాపురానికి పిలుచుకెళుతానని తెలిపాడు. దీంతో నరసింహులు తన కుమార్తెను పంపడం కుదరదని తేల్చి చెప్పాడు. అల్లుడిని కూడా తన ఇంట్లోనే ఇల్లరికం ఉండాలన్నాడు. ఇందుకు సిద్దయ్య అంగీకరించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ పక్కనే ఉన్న కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సిద్దయ్యను వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు పేర్కొన్నారు.

ఓటీ అసిస్టెంట్ పోస్టుల భర్తీపై అభ్యంతరాలు

అనంతపురం మెడికల్: ఏపీ వైద్య విధాన్ పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులైన అభ్యర్థుల కౌన్సిలింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం డీసీహెచ్ఎస్ కార్యాలయంలో చేపట్టారు. ఉమ్మడి జిల్లా డీసీహెచ్ఎస్‌లు డాక్టర్ పాల్ రవికుమార్, డాక్టర్ తిప్పేంద్ర నాయక్ పాల్గొని అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కాగా, ఓటీ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి కొందరు అభ్యంతరాలు లేవనెత్తారు. అర్హత సాధించిన అభ్యర్థుల్లో కొందరు విద్యాభ్యాసం చేస్తూనే సేవా అనుభవం (ఎక్స్‌పీరియన్స్) ధ్రువీకరణ పత్రాలు పొందుపరిచినట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం గందరగోళానికి దారి తీసింది. నకిలీ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ ప్రకటించడంతో పలువురు స్వచ్ఛందంగా వైదొలిగారు. అలాగే ఒకే ఒక రేడియోగ్రాఫర్ పోస్టుకు సంబంధించి అభ్యర్థులెవరూ హాజరుకాలేదు. దీంతో ఆ పోస్టు భర్తీని వాయిదా వేశారు. మొత్తం 56 పోస్టులకు గానూ జనరల్ డ్యూటీ అటెండెంట్ 28, ప్లంబర్లు 5, ఓటీ అసిస్టెంట్లు 8, ల్యాబ్ టెక్నీషియన్లు 2, ఫార్మసిస్టులు 2, పోస్టుమార్టం అసిస్టెంట్లు 3, ఆడియోమెట్రీ 1, ఆఫీస్ సబార్డినేట్ 1, మెడికల్ రికార్డు అసిస్టెంట్ 2 తదితర పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించి అర్హత సాధించిన వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ ఉదయభాస్కర్, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున, జూనియర్ అసిస్టెంట్ చరణ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.


నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఉమ్మడి జిల్లా డీసీహెచ్ఎస్‌లు డాక్టర్ పాల్ రవికుమార్, డాక్టర్ తిప్పేంద్ర నాయక్

సత్యసాయి సన్నిధిలో కార్తీక శోభ


శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పుట్టపర్తి రూరల్: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో దీపాలు వెలుగులీనాయి. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం, గణేష్ ఆలయం, శివాలయం, హనుమాన్ దేవాలయాలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహాశివరాధన, సత్యసాయి నామస్మరణ మార్మోగింది.

జవాన్‌కు గాయాలు

గుంతకల్లు రూరల్: మండలంలోని దోసలుడికి – గుండాల తండా మధ్య సోమవారం ఉదయం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో సీఆర్‌పీఎఫ్ జవాన్ రేఖానాయక్ తీవ్రంగా గాయపడ్డారు. జమ్ము కాశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆయన కొన్ని రోజుల క్రితం సెలవుపై స్వగ్రామం గుండాల తండాకు వచ్చారు. సోమవారం గుంతకల్లు నుంచి ద్విచక్ర వాహనంపై సొంతూరుకు ప్రయాణమైన ఆయన మార్గమధ్యంలో రోడ్డుకు అడ్డంగా వచ్చిన పంది ఢీకొనడంతో వాహనం అదుపు తప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

3న కోటంకలో రాష్ట్రస్థాయి భజన పోటీలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్బారాయుడు స్వామి ఆలయంలో డిసెంబర్ 3న కార్తీక దీపోత్సవాన్ని పురస్కరించుకుని అదే రోజు రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ బాబు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోటీల్లో పాల్గొనే భజన బృందం రూ.300 ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. దాదాపు 11 స్థానాల్లో విజేత బృందాలను ప్రకటించి, నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. వివరాలకు 78010 35551, 94916 61919లో సంప్రదించవచ్చు.

మతసామరస్యానికి ప్రతీక దర్గా హొన్నూరు

- రేపటి నుంచి ఉరుసు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

బొమ్మనహాళ్: ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన దర్గాల్లో ఒక్కటైన బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరులో వెలసిన హజరత్ ఖ్వాజా సయ్యద్ షా సూఫీ శర్మస్త్ హుస్సేనీ చిస్తీ స్వామి ఉరుసు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు దర్గా కమిటీ సభ్యులు వెల్లడించారు.

హిందూముస్లింల ఐక్యతకు నిదర్శనం..

హిందూముస్లింల ఐక్యతకు నిదర్శనంగా దర్గాహొన్నూరులో వెలసిన హజరత్ ఖ్వాజా సయ్యద్ షా సూఫీ శర్మస్త్ హుస్సేనీ చిస్తీ ఉత్సవాలు ప్రతి ఏటా జరుగుతుంటాయి. ఈ ఏడాది 345వ ఉరుసు ఉత్సవాలకు నిర్వాహకులు దర్గాను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ దర్గాకు ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాక మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఉరవకొండ, కణేకల్లు, విడపనకల్లు, కళ్యాణదుర్గం, వజ్రకరూరు, గుంతకల్లు, రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, బెళుగుప్ప మండలాలతో పాటు కర్ణాటకలోని బళ్లారి, మొలకాల్మూరు, రాంపురం, హొసపేట ప్రాంతాల్లోని హిందూ, ముస్లింలు తమ ఇలవేల్పుగా స్వామిని కొలుస్తుంటారు. కాగా, ఏటా ఉరుసు సమయంలో భక్తుల తాకిడి పెరుగుతుండడంతో ఈ ఏడాది ప్రత్యేక బస్సులు నడపాలని భక్తులు కోరుతున్నారు.

గురువారం భక్తుల తాకిడి..

హొన్నూరులోని దర్గాను సందర్శించేందుకు ప్రతి గురువారమూ వందలాది మంది భక్తులు వస్తుంటారు. ప్రత్యేక పూజలు, ప్రార్థనలు పెద్ద ఎత్తున సాగుతాయి. పిల్లలను త్రాసులో ఉంచి అందుకు సమానంగా చక్కెర, పొడి బెల్లంతో స్వామికి మొక్కులు తీర్చుకుంటారు. తమ ఇలవేల్పుగా కొలిచేవారు ఇంటిలో పిల్లలకు స్వామి పేరు పెడుతుండడం గమనార్హం. దీంతో ఈ ప్రాంతంలో వన్నూరుస్వామి, వన్నూరప్ప, వంద్రప్ప, వంద్రమ్మ, వన్నూరమ్మ, వన్నూర్ సాహెబ్, వన్నూర్‌వలి, వన్నూర్‌బీ అనే పేర్లే ఎక్కువగా ఉంటాయి. ఉత్సవాల్లో భాగంగా దర్గాహొన్నూరు పంచాయతీ పరిధిలోని హొన్నళ్లి గ్రామానికి చెందిన హిందువులు ఇంటి వద్ద నుంచి గంధం తెచ్చి పూజలు నిర్వహిస్తారు. సంవత్సరమంతా సంచారం వెళ్లిన స్వామి వారి షంషేర్ గుర్రం ఉరుసు సమయానికి వచ్చి వేడుకల్లో ప్రత్యేకతను చాటుకుంటుంది.


స్వామి సమాధి

ఉత్సవాలు ఇలా...	
తేదీ	ఉత్సవం
నవంబర్ 29	గంధం
నవంబర్ 30	ఒకటవ దీపారాధన
డిసెంబర్ 1	రెండవ దీపారాధన
డిసెంబర్ 2	ఉరుసే షరీఫ్ (దేవుడి సవారీ)
డిసెంబర్ 3	జియారత్

జనవాక్కు

కంటి చూపు బాగుపడింది



వయస్సు పెరగడంతో కంటి చూపు సరిగా కనబడేది కాదు. అక్టోబర్‌లో మా ఊళ్లోనే ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వెళ్లి చూపించుకున్నా... పైసా ఖర్చు లేకుండా అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. కంటి చూపు తగ్గిందంటూ అద్దాలు ఇచ్చారు. ఇప్పుడు చూపు బాగుంది. అన్ని పనులూ చేసుకుంటున్నా. చాలా సంతోషంగా ఉంది. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ఉచితంగా చికిత్సలు చేయించిన సీఎం వైఎస్ జగన్ చల్లగా ఉండాలని కోరుకుంటున్నా.
– లక్ష్మమ్మ, దేవన్నపాళ్యం మడకశిర మండలం

మా పాపను ఆదుకున్నారు



నేను, నా భార్య నాగమ్మ దినసరి కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. ముగ్గురు కుమార్తెలున్నారు. ప్రస్తుతం పదేళ్ల వయసున్న పెద్ద కుమార్తె కమలాగ్లోరీకు చిన్నప్పుడే రెండు కాళ్లు చచ్చుపడ్డాయి. ఎవరో ఒకరు తోడు లేకపోతే కనీసం పక్కకు కూడా కదల్లేదు. దీంతో ఎవరో ఒకరు కూలి పనులకు వెళుతూ.. మరొకరు పాప వద్దే ఉంటున్నాం. పాప పరిస్థితి చూస్తూ ఏడవని రోజంటూ లేదు. కుటుంబ పోషణ భారంగా ఉండడంతో పాపకు పింఛనైనా అందజేయాలని కోరుతూ గత ప్రభుత్వ హయాంలో ఆఫీసుల చుట్టూ తిరగాను. ఫలితం దక్కలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నా కుమార్తెకు ఆధార్ కార్డు... దీని ఆధారంగా సదరన్ సర్టిఫికెట్ మంజూరయ్యాయి. అనంతరం వలంటీర్ వచ్చి పింఛన్ కానుకకు దరఖాస్తు చేయించాడు. నయా పైసా ఖర్చు లేకుండా మా పాప పేరున పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ సొమ్మును అందజేస్తున్న సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం.
– తిప్పన్న, శ్రీరంగరాజుపల్లి, పరిగి మండలం

ఇంగ్లిష్ మీడియం చదువులతో మేలు



ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో పేద విద్యార్థులకు గొప్ప మేలు జరిగింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందజేస్తున్నారు. నా సర్వీస్‌లో ఇప్పటి వరకూ ఇలాంటి గొప్ప సంస్కరణలు అమలు చేసింది ఎన్నడూ చూడలేదు. మనబడి నాడు – నేడు పనులతో ప్రభుత్వ బడుల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. ఏ ప్రభుత్వ పాఠశాలలోనూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడకుండా అన్ని వసతులు కల్పించారు. – రమణారెడ్డి, టీచర్, పుట్టపర్తి

సొంతింటి కల నెరవేరింది



మేము కొన్నేళ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. సొంతింటి కోసం తెలుగుదేశం హయాంలో అర్జీలు పెట్టుకొని కాళ్లరిగేలా తిరిగాము. అయితే జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాం. ఇళ్లు మంజూరైందని చల్లని తీపి కబురు చెప్పారు. పట్టా కూడా చేతికి ఇచ్చారు. ఇల్లు కట్టుకున్నాం. దీంతో ఎన్నో ఏళ్ల మా సొంతింటి కల నెరవేరింది. మా లాంటి పేదలకు ప్రభుత్వమే సాయం చేసి చేదోడు వాదోడుగా నిలుస్తోంది. – రామేశ్వరి, అచ్యుతాపురం, యల్లనూరు మండల